రైతు భరోసా ఏదీ?

సాయం కోసం రైతుల ఎదురుచూపు

- వానకాలం సాగు పనులు షురూ
- విత్తనాలు, ఎరువులకు వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్న అన్నదాతలు
- రైతుల ఇబ్బందులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందే అందిన పంట పెట్టుబడి

దుక్కి దున్నుతున్న రైతులు

కందుకూరు, జూన్ 11 : రోహిణి కార్తె పోయి... మృగశిర కార్తె వచ్చింది. మండల వ్యాప్తంగా విస్తారంగా వానలు పడుతున్నాయి. అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. అదును దాటితే పంట దిగుబడి కష్టం. ఈ పరిస్థితుల్లో అన్నదాత పంట పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొందామంటే చేతిలో రూపాయి లేక రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలు అమ్ముడమే గాక, కొన్నిచోట్ల అమాయక రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగుకు ముందే పంట పెట్టుబడి సాయం అందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంత వరకు 'రైతు భరోసా'పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంతకు రైతు భరోసా ఇస్తారా...? లేదా..? అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మొన్నటి యాసంగి పంటకు సంబంధించిన సాయం కూడా పూర్తి స్థాయిలో వేయలేదని రైతులు చెబుతున్నారు.

కురుస్తున్న వర్షాలు

వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులకు అవసరమైన విత్తనాలు దొరకక ఇబ్బంది పడుతున్నారు. సరైన విత్తనం దొరికితేనే పంట అధిక దిగుబడి వస్తుంది. అది కాకుండా కొన్ని కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచడంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. తమకు కావాల్సిన విత్తనాల కోసం బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేద్దామంటే రైతుల వద్ద చేతిలో రూపాయి లేక వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారు ఇచ్చిన విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నారు తప్పా... రైతులకు నచ్చిన విత్తనాలు లభ్యం కావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు భరోసా ఇస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు రెండు పంటలకు రూ. 10 వేలు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరాకు రెండు పంటలకు రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఈ వానకాలం సాగుకు ఎకరాలకు రూ.7,500 ఇవ్వాలి కదా ..! ఎప్పుడు ఇస్తారు అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అని చెప్పి గత యాసంగి రైతు బంధును నిలిపివేయడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి తమ పంటలను కాపాడుకున్నారు. సాగు సమయంలో రైతులు పంట పెట్టుబడి సాయం కోసం తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులకు రైతు భరోసా అందిస్తే వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుంది.

రైతు భరోసా ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ.15వేలు రైతు భరోసా ఇవ్వాలి. తొలకరి వర్షాలు పడుతుండటంతో రైతులు విత్తనాలు వేసుకోవడానికి సన్నద్ధం అవుతున్నారు. పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంట పెట్టుబడి సాయం రైతులకు అందించాలి.

– సురుసాని సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్

పట్టించుకోని ప్రభుత్వం

రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడం ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందే పంట పెట్టుబడి అందించారు.

– సామ ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్

బడంగ్‌పేట, జూన్ 11: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యటించి ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని డిప్యూటీ మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి డి.కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను మేయర్, డిప్యూటీ మేయర్ దృష్టికి తీసుకుపోయారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ క్లీన్ చేయడానికి, ఊడ్చడానికి స్వీపర్లు కావాలన్నారు. అటెండర్ కూడా లేడన్నారు. అదేవిధంగా.. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నీరు పోయేందుకు నాలాలను శుభ్రం చేయాలని సూచించారు.

అధికారులతో సమీక్షా సమావేశంలో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్

క్రిస్టియన్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మంపు సమస్యలేకుండా శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 11: కాలనీల్లో ఎక్కడా ముంపు సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలో జరుగుతున్న వర్షపు నీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంత వర్షం వచ్చినా ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో క్రిస్టియన్ కాలనీలో ఎంతో వరద సమస్య ఉండేదని అది లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. కాలనీలో నూతనంగా సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు రఫీ, ప్రజ్ఞ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతి రోజు యోగా చేయడాన్ని అలవర్చుకోవాలి

మన్సూరాబాద్, జూన్ 11: ప్రతి రోజు గంటపాటు యోగా చేయడం ద్వారా ఎంతో ఆరోగ్యకరంగా ఉండవచ్చునని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. షిర్డీ సాయి అష్టాంగ యోగా గురు నిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో కర్మన్ ఘాట్, హనుమాన్ దేవాలయం సమీపంలోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్లో ఈనెల 13 నుంచి నిర్వహించనున్న యోగా శిక్షణా తరగతుల బ్రోచర్‌ను మంగళవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీషిర్డీ సాయి అష్టాంగ యోగా గురు నిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ 20 సంవత్సరాలుగా కాలనీల్లో నిర్వహిస్తున్న యోగా శిక్షణా తరగతులు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, నరేందర్, శ్రీరాములుగౌడ్, ఉపేందర్‌గౌడ్, చంద్రశేఖర్, విఠలాచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీషిర్డి సాయి అష్టాంగ యోగా గురు నిలయం ఫౌండర్ ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యోగా శిక్షణా తరగతుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, జూన్ 11: వర్షాకాలంలో ప్రజలకు వరదనీటి ఇబ్బందులు కలుగకుండా పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. మంగళవారం కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని.. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యతా ప్రమాణాలతో.. త్వరితగతిన పనులు పూర్తి చేసుందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనులు పరిశీలిస్తూ.. నూతన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. అదే విధంగా.. సైదాబాద్ డివిజన్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్ కుమార్తె మరియం కుసర్‌కు మంగళవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల వినికిడి యంత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాల ముందు పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు

డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్, జూన్ 11: పాఠశాలల ప్రారంభానికి ఒక రోజు ముందు కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ముందు డ్రైనేజీ నీరు పొంగి పొర్లుతోంది. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల ప్రహరీ లోపల కూడా డ్రైనేజీ నీరు నిండిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు అధికారులకు, కార్పొరేటర్‌కు ప్రజలు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులతో కలిసి డ్రైనేజీ క్లీనింగ్ పనులు చేపట్టారు. పాఠశాలలు బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల వద్ద డ్రైనేజీ నీరు పొంగిపొర్లడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఈ దుస్థితి దాపురించిందని అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి ఆరీఫ్, పాఠశాల హెడ్మాస్టర్ విజేందర్, శ్రీనివాస్, తోట మహేందర్ యాదవ్, అశ్విన్ సింగ్, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ముందు పొంగి పొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్ హోల్‌ను జలమండలి అధికారులతో క్లీనింగ్ చేయిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే పీజీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 10 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

వనస్థలిపురం, జూన్ 11: బీఎన్ రెడ్డినగర్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు.

జీహెచ్ఎంసీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

మన్సూరాబాద్, జూన్ 11: సహారాస్టేట్స్‌కాలనీ మొదటి గేటు సమీపంలో ఉన్న జీహెచ్ఎంసీ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపిస్తూ మంగళవారం సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ, కమలానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆందోళనకు దిగారు. కాలనీలవాసుల కథనం ప్రకారం.. సహారాస్టేట్స్‌కాలనీ మొదటి గేటు సమీపంలోని ఓ అపార్ట్‌మెంటు ముందు జీహెచ్ఎంసీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. మంగళవారం ఉదయం సదరు స్థలాన్ని కొందరు వ్యక్తులు జేసీబీతో చదును చేసి ఫెన్సింగ్ వేసేందుకు పనులు ప్రారంభించారు. విషయాన్ని తెలుసుకున్న సహారాస్టేట్స్ కాలనీ, కమలానగర్ కాలనీకి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. జీహెచ్ఎంసీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ పనులను అడ్డుకున్నారు. కాలనీలవాసుల ఆందోళనతో పనులను నిలిపివేసి జేసీబీని అక్కడి నుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ ప్రధానకార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మేకల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి శేఖరయ్య, సంయుక్త కార్యదర్శి భీమానాయక్, కమలానగర్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, కాలనీలవాసులు నర్సింహాగౌడ్, పవన్‌కుమార్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపును అరికట్టాలి

సైదాబాద్, జూన్ 11: అక్రమ గోవుల తరలింపును అరికట్టాలని అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి మంగళవారం సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి ధరావత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బక్రీద్ పండుగను పురస్కరించుకొని పాతబస్తీలోకి వేలాది గోవులు అక్రమంగా తరలివెళ్తున్నాయని, వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ సహాయక కార్యదర్శి మల్లేశ్ గౌడ్, రాఘవేందర్, మాణిక్ ప్రభుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మన్సూరాబాద్, జూన్ 11: ఇటీవల నూతనంగా ఎన్నికైన మన్సూరాబాద్ డివిజన్ పరిధి లెక్చరర్స్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. లెక్చరర్స్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కొప్పుల విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. లెక్చరర్స్‌కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి, చింతపల్లి కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, రవికుమార్, సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, రఘునాథ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లోకి ప్రింట్ మీడియా టీమ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వీ డ్రీమ్స్ బిజ్‌టెక్ కార్పొరేట్ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో ప్రింట్‌మీడియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం స్థానిక విజయానంద్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ప్రింట్‌మీడియా టీమ్ 39 పరుగుల తేడాతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీజీ)పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రింట్ మీడియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. రవికుమార్(36), రోనిత్‌సింగ్(36) మెరుగ్గా రాణించారు. ఫణి కిశోర్(3/27) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఎస్ఏటీజీ టీమ్ 7 వికెట్లు కోల్పోయి 147 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ కుమార్ బాబు (54) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. మూడు వికెట్లతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన ప్రింట్‌మీడియా ప్లేయర్ రాజశేఖర్(3/18)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. బుధవారం జరిగే సెమీస్‌లో డాక్టర్స్-11 టీమ్‌తో ప్రింట్‌మీడియా తలపడుతుంది.

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని సన్మానిస్తున్న కానిఫ్‌ఖాన్ టీం సభ్యులు. చిత్రంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, తదితరులు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో బడిబాట

హాజరైన ప్రధానోపాధ్యాయుడు రమేశ్, సూపర్‌వైజర్లు నారాయణమ్మ, యశోధ

సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న హెడ్‌మాస్టర్ రమేశ్, సూపర్‌వైజర్ నారాయణమ్మ, బి.యశోధ తదితరులు

బడంగ్‌పేట, జూన్ 11: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. సరూర్‌నగర్ మండల పరిధిలోని సుభాష్ చంద్రబోస్‌నగర్ కాలనీలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు రమేశ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.నారాయణమ్మతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య, విశాలమైన గదుల్లో బోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్, బూట్లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి.. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బి.యశోధ, లక్ష్మి, శిరీష తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ శాశ్వత పరిష్కారానికి కృషి

హయత్‌నగర్, జూన్ 11: డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్‌లోని శాంతివనం టౌన్‌షిప్, ఉషోదయ కాలనీల్లో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు తమ కాలనీల్లో సరిపడా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించకపోవడంతో డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. దాంతో స్థానికంగా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. తమ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శాంతివనం టౌన్‌షిప్ కాలనీ అధ్యక్షుడు వెంకటేశం, సభ్యులు రహీం, శ్రీనివాస్, గోవిందరెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, భరత్, ఎల్లమయ్య, జలమండలి సూపర్‌వైజర్ బాలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

సాధారణ ప్రజలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి స్వయంప్రభ గారు దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని శ్రీ శ్రావణ్ కుమార్ సొనిగార, తండ్రి: కెవల్ చంద్ సొనిగార, వయస్సు: సుమారు 41 సంవత్సరాలు, నివాసం: ఇం.నెం. 2-2-555/1, ఫ్లాట్ నెం. 804, భరత్ నగర్, కమ్యూనిటీ హాల్ సమీపాన, బాగ్ అంబర్‌పేట్, అంబర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ వారి నుండి కొనుగోలు/అమ్మకం ఒప్పందం కుదుర్చుకున్నారు మరియు అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానాగా కొంత మొత్తాన్ని చెల్లించారు.

షెడ్యూల్ ఆస్తి

మహేశ్వరం, SRO పరిధిలో, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, సిరిగిరిపూర్ రెవెన్యూ గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద, 31-03-2021 తేదీనాటి ఆమోదిత HMDA లేఅవుట్ LP No. 000175/LO/PLG/HMDA/2021 ప్రకారం, రాయల్ రిడ్జ్ పేరునగల మరియు శైలిలోని లేఅవుట్‌లోగల సర్వే నెం.లు 114/1AA/1 & 114/1E/1లో ఖాళీ ప్లాట్ నెం. 5 విస్తీర్ణం 200 చ.గజాలు, ఖాళీ ప్లాట్ నెం. 17 విస్తీర్ణం 200 చ.గజాలు ప్లస్ మొత్తం విస్తీర్ణం 400 చ.గజాలు యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.లు 04, 18, దక్షిణం: ప్లాట్ నెం.లు 06, 16, తూర్పు: 30 అ.వెడల్పు రోడ్, పడమర: మహేశ్వరం నుండి హైదరాబాద్‌కు వెళ్లే 150 అ.వెడల్పు రోడ్.

నా క్లయింట్ యొక్క సదరు కొనుగోలుకు సంబంధించి ఏవేని అభ్యంతరాలు కలిగి ఉన్నవారు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 15 రోజులలోగా వ్రాతపూర్వకంగా పంపవలెను/నన్ను సంప్రదించవచ్చును, లేనిచో సదరు వ్యక్తి(ల) క్లెయిమ్(లు) రద్దు చేసుకున్నట్లుగా మరియు/లేదా వదిలివేయబడినట్లు భావించబడును మరియు సదరు బదిలీ పూర్తి చేయబడుతుంది.

సం/- **రఘు గుర్రం,** అడ్వకేట్
6-3-883/A/1, ఫ్లాట్ నెం. 302,
3వ అంతస్తు, ఇంపీరియల్ ప్లాజా,
పంజాగుట్ట వద్ద, హైదరాబాద్-500 082,
మొబైల్: 8096032018.